# అమెరికా వంటింటి పద్యాలు

## సత్యం మందపాటి




శ్రీ
కౌముది
మీ మునివేళ్ళలో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 52



# అమెరికా వంటింటి పద్యాలు

సత్యం మందపాటి



చిత్రాలు:గోపి బూరుగు




*1. ఏకలవ్యుడు*

మనసులో పదిలంగా నిలిచివున్నాయి ఆరుద్ర ఇంటింటి పజ్యాలు
ఆ బాణీలోనే బోణీ చేస్తున్నాను నా అమెరికా వంటింటి పద్యాలు
నమస్కారం గురూగారూ మీ ముందు వేస్తున్నాను కుప్పిగంతులు
ఎప్పుడు నచ్చకపోతే అప్పుడే చెబుదాం వీటికి అప్పగింతలు




*2. అమెరికాకి దారి ఎటు*

అమెరికా వెళ్ళాలంటే ముందుగా కావాలి వీసాలు
అవి రాకుండా అప్పుడే తీసెయ్యొద్దు మీ మీసాలు
అయిదరాబాదూ విశాఖ గోదారీ గుంటూరూ బందరూ
అటూ ఇటూ చూడండి ఏ దారిన పోతున్నారో అందరూ




*3. రేసింగు*

సుబ్బారావు వెళ్ళే ఆ మెత్తటి రోడ్డు పేరు సాఫ్ట్‌వేరు
అప్పారావుని చేయమన్నాడు వాళ్ళ సారు హార్డువేరు
నరసమ్మగారు ఏం చదవాలో తెలీక గబగబా చదివేసింది గొప్పగా నర్సింగు
ఏ సింగు ఎలా రేసింగు చేసినా అమెరికాలో చేయాల్సింది మాత్రం బాక్సింగు







*4. ఎలాగయితేనేం సార్!*

సుబ్బారావు ఆరు నెలల్లోనే పూర్తి చేశాడు ఆరోకిల్లు
అమెరికా పోవటానికి తాకట్టు పెట్టాలేమో వాకిలీ ఇల్లు
వీసాలిప్పించటానికి ఏజెన్స్‌లుంటాయిట వెడితే పట్నం
డబ్బు చాలకపోతే పెళ్ళి చేసుకుని గుంజటమే కట్నం

*5. అరిచేతిలో స్వర్గం*

అప్పారావు మంచి కాలేజీలోనే చదివాడు ఇంజనీరింగు
ధనవంతుల పిల్లాడే అంటున్నది వేలి మీద డైమండ్ రింగు
కాకపోతే ఎటు పోవాలో ఎలా పోవాలో ఏమీ తెలీటం లేదు
చేతిలో జెర్రిపోతంత అమెరికా రేఖ మరి విధి బలీయం కదు!

*6. భయమెందుకే చిట్టీ భయమెందుకే!*

నరసమ్మగారికి రోగుల్ని చూస్తే నీరసం చచ్చేంత ఎలర్జీ
మందులివ్వాలన్నా మాట్లాడాలన్నా పోతుంది ఆమె ఎనర్జీ
అవతలివారికి ఇంజక్షన్ పొడవాలంటే ఆవిడకి అమిత భయం
అయినా సరే అమెరికాకి పంపిస్తానని ఇచ్చాడా ఏజంటభయం

*7. అద్దానికి అవతలి వైపు*

సుబ్బారావు దూరదేశం వెడుతున్నాడని నాన్నకి ఎంతో దిగులు
కొడుకుని వదల్లేని ఆ అమ్మకేమీ తెలియటం లేదు రాత్రీ పగలు
అప్పారావు తల్లికి మాత్రం బాగా పీకుతూనే వుంది మళ్ళీ మళ్ళీ
ఏ తెల్ల పిల్లో అతన్ని ఎగరేసుకు పోతే మరి కట్నం హళ్ళికి హళ్ళి

*8. సమస్యాపూరణం*

నాన్నకి తెల్లపిల్లలు వల్లో వేసుకుంటారేమోనని పెద్ద అనుమానం
అమ్మకి వాళ్ళబ్బాయంటే బంగారు కొండంత ప్రేమా అభిమానం
ఆ చేత్తోనే అతని చేత మూడు ముళ్ళూ వేయించి పంపించేస్తే పోలా
అంటే అతనన్నాడు శుభమా అంటూ అమెరికా వెడుతుంటే ఏమిటీ గోల

*9. వందే మాతరం*

నరసమ్మగారి ముఖంలో వెళ్ళేదాకా చిందులేసింది చిరునవ్వు
వెళ్ళబోయే ముందు బాధపడింది గుర్తుకొచ్చి దేశం మీద లవ్వు
ఈసాలొచ్చేసినాయండి అన్నాడు ఏజెంటు జేబులు నిండగ
అమెరికాకి కాకిలా ఎగిరింది విమానం ఆ రోజందరికీ పండగ

*10. నారాయణ... నారాయణ...*

పిల్లల్ని విమానంలో చేతులు బయటపెట్టనీకు అడ్డమైన పక్షులూ ఉంటాయంది అమ్మమ్మ
ఎంతో దూరం వెడుతున్నారు ప్రయాణంలో అన్నం పెడతారో లేదో అంది అమ్మ
ఒరేయ్! మేఘాల్లో వెళ్ళేటప్పుడు ఆకాశవీధిలో నారదుడు కనపడతాడేమో చూడు
అంటాడు రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని నవ్వుతూ బాల్యమిత్రుడు రంగడు




*11. దివి నుండి భువికి...*

సరిగ్గా రావలసిన సమయానికే దివి నుండి భువికి దిగింది విమానం
సినిమాలూ సమోసాలతో సుఖంగానే జరిగింది అమెరికా యానం
విమానాశ్రయంలో గబగబా లాంఛనాలన్నీ పూర్తిచేసుకుంటుంటే మనసులో అలజడి
బయట కొంకర్లు పోయే చలికి వేడిగా గుర్తొచ్చింది భారతంలోని వెచ్చని అమ్మ ఒడి

*12. అమ్మ!*

అమెరికాలో మిత్రుడింటికి చేరగానే ఇండియాకి ఫోన్ చేశాడు
డబ్బూ పాస్పోర్టూ జాగ్రత్తగా దాచుకున్నావురా అన్నాడు నాన్న
ఏరా ఎలావుంది న్యూయార్కులో బాగా చలిగా వుందా అడిగాడన్నయ్య
బాబూ! ప్లేన్‌లో ఏం పెట్టారో ఏమో అన్నం తిన్నావురా అంది అమ్మ!




*13. ఏ రాయయితేనేం ...*

ఈ రావూ ఆ మూర్తీ అలివేలూ అరవిందా రాధ
పేరేదయితేనేమండీ మనందరిదీ ఒకటే కదా కథ
అమెరికా జీవనసరళిలో కష్టం సుఖం సంతోషం బాధ
మీతో సరదాగా పంచుకుందామనే నా ఈ సొద

*14. కుడి ఎడమయితే ...*

ఈ కారుకి స్టీరింగ్ వీలేదీ అన్నాడు కుడి పక్కన కూర్చున్న నాయుడు
ఇదుగో నా వేపుంది చూడవయ్యా అంది నవ్వుతూ కన్నుగీటి అమ్మడు
అలవాటు కొద్దీ రోడ్డుకు ఎడమ పక్కనే ఒద్దికగా నడుపుతున్నాడు అతడు
కుడి ఎడమయితే ఇక నా దగ్గరకే రావటం అంటున్నాడు ఆ పైన దేవుడు

*15. ఎవరూ లేని చోట*

నాలుగు రోడ్ల కూడలిలో నాలుగు పక్కలా నాలుగు ఎర్రటి స్టాపు సైనులు
వచ్చే పోయే కారులన్నీ ఒక పద్ధతిలో ఆగటం చూసి మన ఇండియా చైనులు
అర్థరాత్రి పోలీసులెవరూ లేని చోట కూడా మరి ఎందుకు చెప్పు ఈ లైనులు
అంటే పక్కనే వున్న బామ్మరిది అన్నాడు పట్టుకుంటే కట్టాలి బావా పెద్ద ఫైనులు

*16. ఏమిటీ రహస్యం...*

పెద్ద రహదారులే కాక సందులూ గొందులూ ఇళ్ళ ముందూ వెనుక
అంతా అంత శుభ్రంగా ఇలా ఎందుకుంటాయా అనేదొక ప్రశ్న కనుక
ఒకటే చిన్న జవాబు, ఈ ప్రజల్లో కనపడేవి హక్కులు కాదు బాధ్యతలు నాయనా
మడీ తడీ బట్టల్లో కాదు, ఆ శుచీ శుభ్రం మనసుల్లో వుంటే నే సాధ్యం ఏదయినా

*17. అష్టావధానం*

రోజూ గబగబా చేసేయాలి సాయంత్రానికి వంట
ఆఫీసుకి ఆలస్యంగా వెడితే బాసుతో పెద్ద తంటా
శనాదివారాలు పనిమనిషీ వంటమనిషీ చాకలీ తోటమాలి
డ్రైవరూ బేబీసిట్టరూలాటి ప్రక్రియలతో అష్టావధానం చేయాలి

*18. మెల్ల మెల్ల మెల్లగా...*

భుజాలెగరేసి అర్థమయేటట్లు నటిస్తూ మెల్లగా మాట్లాడతాడు మైకేల్ మిల్లర్
రేడియో వార్తల్లా కనిపించకపోయినా ఫోన్లో చక్కగా వినిపిస్తుంది లీసా షెల్లర్
తెంగ్లీషులో లొడలొడా ఎక్స్‌ప్రెస్ రైల్లా మాట్లాడతాడు రామరాజు చిల్లర్
అమెరికా రాగానే మొట్టమొదట మనవాళ్ళకి కమ్యూనికేషన్ ఒక పెద్ద కిల్లర్

*19. రాజుగారికి నిత్య దణ్ణాలు*

మన దేశమూ కాదు సంస్కృతీ రంగూ కానేకాదు మరి లేవా రాగద్వేషాలు
అమెరికన్ యాస ఇంగ్లీష్ అసలే రాదు మరెందుకిస్తారు మనకిక్కడ ఉద్యోగాలు
ధనస్వామ్యంలోని గొప్పతనమిదేనని ఒప్పేసుకుని చేస్తే చాలదు ఉపన్యాసాలు
రోజూ నిద్ర లేవగానే మార్టిన్ లూథర్ కింగ్ పటానికి చేయాలి నమస్కారాలు!

*20. అప్పగింతలు*

ఇండియాలో కక్కొచ్చినా కల్యాణమొచ్చినా ఆగమంటే ఆగవు మరి
అమెరికాలో ఉద్యోగం కూడా వస్తే సరేసరి పోతే అంతటితో సరి
శుక్రవారం సాయంత్రం నాలుగింటికి అందిస్తాడు బాసు పింకు స్లిప్పు
నిన్ను వదల్లేక వదులుకుంటున్నానంటాడు ముఖంలో ఒకటే ఏడుపు



*21. మా నాయనే!*

బాగున్నావా నాన్నా ఫోనులో అంది మూడేళ్ళ మనవడితో నాయనమ్మ
హవ్వీజ్ ఇండియా బామ్మా! ఎవరు కావాలి నీకు నాన్న ఆర్ అమ్మ
అమ్మ వెంటు వర్క్ అండ్ ఐ డోంట్ నో వెన్ షి ఈజ్ కమింగ్
నాన్న ఈజ్ ఇన్ కిచన్ పప్పు రుబ్బింగ్ అండ్ గిన్నెలు తోమింగ్




*22. పొరుగింటి పుల్ల కూర*

అడుగుతుంది భార్య ఇవాళ సుక్కురారం బయట తిందామా పిజ్జా బరీటో లేదా నాచో
బద్ధకంగా అంటాడు భర్త టీవీ చూస్తూ, వద్దు నీ చేతి వంటే నాకు ఇష్టం ఇలా కూచో
ఇండియా వెడితే అడిగాడు మేనల్లుడు మామా ఏం తింటావ్ ఇటాలియనా చైనీసా
ఇక్కడా అవెందుకు ఇంచక్కా గోంగూరా ఆవకాయా కందిపచ్చడీ కావాలి శ్రీనివాసా




*23. ఏమప్పా, తమిళనాడులో తమిళం తప్పా?*

కహా జానా అంటాడు అయిదరాబాదులో ఆటోవాలా మనల్ని అదోరకంగా చూసి
విష్ యు హేపీ బాత్ డే అండీ అంటుంది తెలుగు యాంకర్ షల్వార్ కమీజ్ వేసి
దె డోంట్ స్పీక్ తెలుగు ఇన్ చెన్నై, దె రిప్లై ఇన్ తమిళ్ తెలుగావిడ ఫిర్యాదు చేస్తుంది
మా అమ్మాయి మాత్రం ఇండియాకి ఫోన్ చేసి బాగున్నావా తాతయ్యా అనడుగుతుంది

*24. త్రిశంకు స్వర్గం*

అక్కడుంటే ఇక్కడికి రావాలనీ
ఇక్కడుంటే అక్కడికి పోవాలనీ
ఎప్పుడూ తీపే కదా మరి డాలర్ల మనీ
ఇక త్రిశంకుస్వర్గంలోనే హనీమూనులన్నీ




*25. అంతులేని కథ*

ఐదేళ్ళల్లో తప్పక ఇండియాకి తిరిగొస్తాం కదా అమ్మా నాన్నా
హెచ్ వన్ వీసా నించీ గ్రీన్‌కార్డు రావటం ఎలాగో చెప్పన్నా
ఇల్లు కొనుక్కొని యుఎస్ సిటిజన్ అవటమే మంచిదనుకుంటున్నా
అలాగని మేమిక్కడేం సెటిలవటం లేదు తిరిగి వెడతాం ఏనాటికన్నా

*26. అంటరానివాళ్ళం*

పెద్ద కులాలు చిన్న కులాలని ఉంచుతాయి ఎంతో కొంత దూరం
మనమూ పట్టించుకోం మరి కాపాడాలి కదా సత్ సంప్రదాయం
అమెరికా తెల్లవాడు, నల్లవాళ్ళనీ మనల్నీ కొంచెం తక్కువగా చూస్తే
పక్షపాతం అమెరికాలో ఎక్కువ అంటాం మన సంగతి ఒప్పుకోం చేస్తే

*27. నైవేద్యం సమర్పయామి*

మంత్రాలన్నీ చెప్పి మనల్ని అనమంటాడు పురోహితుడు మమ
అమెరికావాళ్ళం! అవేమీ అర్థంకావు కనుక అవన్నీ మనమన్నట్టే సుమ
మరి గుళ్ళో దేవుడు కూడా చూసీ చూడనట్టు పోతాడేమిటి చెప్మా
పుణ్యం సంగతేమోకానీ బాగుంటాయి మా గుళ్ళో అమ్మే ఇడ్లీ ఉప్మా




*28. మనవాడే*

ఎవరే ఆ అబ్బాయి? మన కులమా, గోత్రమా? కాదు
మరయితే అమెరికనా? తెల్లవాడా? నల్లవాడా? కాదు
పటేలా, బెనర్జీనా, సర్దార్జీనా, అయ్యరా, నాయరా, మనవాడు కాదూ
నేను ఎవర్ని చేసుకున్నా నాన్నా! అతనప్పుడు మనవాడే అవుతాడు కదూ!

*29. ఎండా వానా పెళ్ళి*

తెల్ల ధోవతి కట్టుకున్న తెల్ల మైకేల్ బొజ్జ గణపతికి పూజ చేశాడు
పెళ్ళి కొడుకు తల్లి శార శారీ కట్టుకుని సందడే సందడి చేస్తున్నది
పాస్టా సాలాడు వంకాయకూర సాంబారు దెప్పడాలు లేని కారం అప్పడాలు
ఈ ఇంగ్లీషు తెలుగు పెళ్ళికి మంత్రాలు మాత్రం సంస్కృతంలోనే చదవడాలు

*30. మళ్ళీ పెళ్ళి*

మర్నాడు పక్కనే చర్చిలో వివాహం మరి మీరందరూ తప్పక రావాలి
తెల్ల గౌను వేసుకున్నది అందమైన కొత్త పెళ్ళి కూతురు ప్రేమ కావలి
మైకేలూ ప్రేమా కళ్ళల్లో ప్రేమ కురిపిస్తూ మార్చుకున్నారు డైమండ్ ఉంగరాలు
పెళ్ళికొడుకు తండ్రీ పెళ్ళికూతురి తల్లీ తర్వాత డాన్స్ చేస్తూ తిరిగారు బొంగరాలు

*31. వేడినీళ్ళకి చన్నీళ్ళు*

అమెరికా జీవనంలో ఎందుకో అర్థంలేని ఆరాటం
నిత్యం మనగడకే చేయాలి మనమెంతో పోరాటం
భార్యాభర్తలిద్దరూ కష్టపడి పని చేస్తేనే వేడినీళ్ళకి చన్నీళ్ళు
కాకపోతే పెంపకం లేక అవి మిగల్చకూడదు పిల్లలకి కన్నీళ్ళు

*32. గంటకి ఎంత?*

నాన్నా నీకు ఉద్యోగం చేసినందుకు గంటకి ఎంతిస్తారు
నీకెందుకురా భడవా! నవ్వుతూ చెప్పాడు ఎంతిస్తారో
నేనంత ఇచ్చుకోలేను కానీ నా దగ్గరున్న ఇరవై ఇస్తాను
నాతో వారానికి రెండు గంటలు సరదాగా గడుపుతావా?




*33. మాతృదేవోభవ*

నేను శెలవు పెట్టి ఇండియాకి వస్తున్నా మరి మీకేం కావాలి?
చెల్లెలికి సెంటు బాటిల్, తమ్ముడుకి ఎంపీత్రీ, అన్నయ్యకి కేమెరా
నాన్నకి మంచి ఇంగ్లీష్ పుస్తకాలు ఇష్టం, మరి అమ్మా నీకేం కావాలి?
నాకేం కావాలి నాయనా! నువ్వు క్షేమంగా రా! నాకు అదే కావాలి!

*34. పూల భాష్పాలు*

నువ్వు ఎప్పుడూ ఏడ్చేవాడికి బాగా నవ్వటం నేర్పు
నవ్వీ నవ్వీ అలసిపోయినప్పుడు వాడికి పోతుంది ఓర్పు
అప్పుడే ఏడుస్తాడు దీర్ఘంగా విడుస్తూ ఒక పెద్ద నిట్టూర్పు
జీవన చక్రభ్రమణంలో ఏడుపూ నవ్వుల కలయికే ఓదార్పు

*35. బ్రహ్మ వాక్కు*

భారతీ! మన తెలుగువాళ్ళు అమెరికాలో కలిసిమెలిసి వుంటున్నారుటమ్మా
ఆ మాటలకి తన సృష్టిలో ఏదో లోపం జరిగిందని ఉలిక్కిపడ్డాడు బ్రహ్మ
రాజకీయ రాయబారంతో కడ్డి కులం మేమే గొప్పని ఎక్కారు చెట్టు మీద పై కొమ్మ
కొమ్మలెక్కే బాపతు కాకపోయినా మేమేం తక్కువ తినలేదన్నారు రెండో కులం రెమ్మ




*36. కలసివుంటే కలదు సుఖం*

కడ్డివారమ్మాయి ఒక తెల్ల కుర్రాడిని గుట్టుగా గుళ్ళో పెళ్ళి చేసుకుంది
రెమ్మవారబ్బాయికీ ఒక నల్లమ్మాయికీ ఘనంగా చర్చిలో వెడ్డింగ్ జరిగింది
రెమ్మవారమ్మాయికీ కడ్డివారబ్బాయికీ జరిగే కల్యాణం సర్వేజనా సుఖినోభవంతు
మరి ఈ చదువుకున్న పెద్దవాళ్ళని ఇంకా ఎందుకు వదలదో పుట్టింటి పురిటి కంపు!

*37. గీతా సారం*

ఎక్కడున్నా మన మధ్య గీతలు గీసుకోమనే మన నుదిటి గీతల సారం
ఆ గీతాసారాన్ని కాదనలేని సామాన్య మానవమాత్రులం మనం తెలుగువారం
అందుకే రెండేళ్ళకోసారి బదులు ఏటేటా ఈ తెలుగు సంబరాల తిరునాళ్ళు
ఒకటి పాటా ఒకటి తందానా ఆ లోగుట్టు తెలిసినాయనొక్కడే పెరుమాళ్ళు

*38. వ్యాకులం*

కమ్మ రెడ్డి మాల మాదిగ రాజు సెట్టి శర్మ
ఇంకా ఎందుకు మనకీ కుల దౌర్భాగ్యపు ఖర్మ
అనవసరం కుల మత అర్థరహిత రాజకీయ రెచ్చగొండి రిజర్వేషనులు
ఆర్థికపరమైన సహాయ సహకారాలే తల్లి భారతికి మనమిచ్చే మల్లెమాలలు

*39. ఆనాడూ ఈనాడూ*

టెక్సస్‌లో ఆరోజుల్లో ఒక ఊరినించీ ఇంకో ఊరికి వెడుతుంటే పెట్రోలయిపోయిందనుకోండి
పెట్రోలమ్ముతాడు కానీ టాయిలెట్ మాత్రం తెల్లవాళ్ళకి మాత్రమే అనేవాడు కళ్ళున్న ఆ కబోది
ఈమధ్యనే ఇండియానించీ దిగిన పాత మిత్రుడు చూశాడు మా ఎదురింటి డాక్టరు మైకేలుని
మీ ఇంటి చుట్టూ నల్లవాళ్ళున్నారే మరి క్షేమమేనా? పైకి కక్కాడు తన మనసులోని దిగులుని

*40. కనకపు సింహాసనం*

మా అమ్మాయికి వుందొక తెల్లటి అందమైన బొచ్చుకుక్క, జాతి మాల్టీజు
ఉంది కాదు ఉన్నాడు. వాడు మగాడు, నీకు చిన్ని మనవడు పేరు రాజు
వాడొచ్చినప్పుడల్లా నా మంచం మీదనే నా పక్కన కనకపు సింహాసనం
అదేమిటో కుక్కలన్నా పిల్లలన్నా ప్రేమా అనురాగం అనేవిక్కడొక వ్యసనం



### *41. వెళ్ళొస్తాను!*

ఇంటికి రాగానే అమ్మకి బాగాలేదని తమ్ముడి దగ్గరనించీ ఫోను
ఎలావుంది? వెంటనే రమ్మంటావా? అమ్మకిస్తావా ఫోను అన్నాను
బాబూ! బాగున్నావా? నేను వెళ్ళిపోతున్నాను. మళ్ళీ నిన్ను చూస్తానో లేదో నాన్నా!
అంటూ ప్రాణాలు వదులుతుంటే వైర్ల కివతల నుంచుని చేసేది వుందా ఏమన్నా!

### *42. అడుగడుగున గుడి వుంది*

పూర్వం గుడికెళ్ళాలంటే రెండొందల మైళ్ళు కారు నడుపుకుంటూ వెళ్ళే వాళ్ళం
ఇప్పుడిందుగలదందు లేదని ఎక్కడ చూసినా గుళ్ళే! మరి వీటికి వేయలేం కళ్ళెం
ఎన్నో గుళ్ళల్లో ఎంతోమంది దేవుళ్ళు! మరందర్నీ సంతోష పెడితేనే నిత్య భజనలు
కొన్ని గుళ్ళు కులాలవారీగా కట్టుకున్నారు! మన తెలుగువాళ్ళకి కావలసింది విభజనలు

### *43. ఏదీ? ఎక్కడ?*

నేను సూటిగా ప్రశ్నిస్తున్నాను ఎక్కడండీ వున్నది ఆ దేవుడని
రాళ్ళల్లో రప్పల్లో ఆచారాల్లో తంతుల్లో కర్మకాండల్లో వున్నాడని
ఎందుకలా ఆకాశంలోకి అలా పై చూపులు చూస్తావు అంతా మిధ్య
మానవత్వపు కళ్ళతో చూస్తే కనిపిస్తాడిక్కడే మనిషికీ మనిషికీ మధ్య

### *44. సమ్మతం*

కరుణామయుడు క్రీస్తు ప్రభువుకి నిలువుగా వేశారు శిలువలు
మహా సాధ్వి ద్రౌపదికి నిండు సభలో విప్పారు వలువలు
మతం పేరుతో ఇలాటివెన్నో చేశారు చిలువలు పలువలు
మనిషికి మతం కాదు సమ్మతం, కావాలి మానవత్వపు విలువలు

*45. కృష్ణమస్*

ఏరా! క్రిస్మస్ చెట్టూ, బయట లైట్లూ, ఎన్నో రంగుల అలంకారాలు
మతం పుచ్చుకున్నావేమిటి నూరాడు బాబాయి కారాలూ మిరియాలు
ఇది మన దీపావళిలాగానే అన్ని మతాల వాళ్ళూ ఎంతో ఆనందించే పండుగ
మానవాళికి మనమందించే ఆ శాంతీ సుఖ సంతోషాలు నింగీ నేలా నిండగ

*46. వేదాంతం వారబ్బాయి!*

పుట్టగానే నువ్వు కెవ్వుమని ఏడవలేదూ
నువ్వు పోతే మీవాళ్ళందరికీ ఏడుపే కదూ
రెండు ఏడుపుల మధ్యా నవ్వుతూ బ్రతకాలి కానీ
ఎందుకయ్యా ఏడుస్తావు నీకు లేదని పదవీ మనీ!




*47. సరసం విరసం కొరకే!*

తెలుగు సినిమాల్లో హీరోయిన్ వేషాలు చూసి వేడెక్కివున్నట్టున్నాడు
అమెరికా రాగానే ఇక్కడ సరసాలు కిలోల్లో అమ్ముతారనుకున్నాడు
సరదాగా మాట్లాడిందని ఆఫీసులో శారాని వాటేసుకున్నాడా వాజమ్మ
సెక్సుయల్ ఎబ్యూజ్ పేరుతో అతని ఉద్యోగం ఎక్కింది చెట్టు కొమ్మ

*48. ఎంతెంత దూరం*

భారతంలో పెరిగిన ఖర్చులు, రాజకీయాలు, వయొలెన్స్, లంచం, చెత్త అంతా రొష్టు
భరించలేకపోతున్నాం బాబూ, అమెరికాకి వెడితేనే మనకీ మన పిల్లలకీ ఎంతో బెస్ట్
అమెరికా భూతల స్వర్గం ఏమీ కాదు! ఇక్కడికి వచ్చి మన సంస్కృతికి దూరమవుతున్నాం!
ఈ మరబొమ్మ బ్రతుకికక చాలండీ చాలు! తిరిగి వెళ్ళిపోదామనే గట్టిగా ఆలోచిస్తున్నాం!

*49. ఏకత్వంలో భిన్నత్వం*

అమ్మనీ నాన్ననీ ఇక్కడికి వచ్చి మనతోనే వుండమంటే ఎలా వుంటుంది?
పెద్దవాళ్ళయిపోతున్నారు, ఒక్కళ్ళే ఇండియాలో వుండే కంటే ఇక్కడే బాగుంటుంది!
అమ్మనీ నాన్ననీ ఇక్కడికి వచ్చి మనతోనే వుండమంటే ఎలా వుంటుంది?
అదే మంచిది. ఇద్దరు పిల్లలకి నెలనెలా బేబీ సిట్టింగ్‌కి మరి చాలా అవుతుంది!

*50. గుడ్ లక్!*

అధ్యక్షుడు బుష్‌కి చిక్కలేదు దొరకలేదు మాయదారి ఒసామా
ఆర్థిక సంక్షోభంతో అరుస్తున్నాయి కంపెనీలు మాదాకోళం అమ్మా
ఉద్యోగాలూ ఇళ్ళూ పోయి జనం తలమునకలవుతున్నారు సుమా
ఈ పద్మవ్యూహంలోకి చొచ్చుకువచ్చాడు మరేం చేస్తాడో ఒబామా!




*51. చిన్న తేడాయే శిష్యా!*

నాకో పనికిమాలిన అనుమానం మరి తీరుస్తారా గురువుగారూ
ఆర్థిక మాంద్యానికీ, ఆర్థిక సంక్షోభానికీ తేడా ఏమిటో చెప్పరూ
నీ పక్కింటాయనికి ఉద్యోగం పోతే అది ఆర్థిక మాంద్యం
ఆ పోయేదేదో నీకే పోతే అదో మహా పెద్ద ఆర్థిక సంక్షోభం
(ఆర్థిక మాంద్యం: Economic Slow Down
ఆర్థిక సంక్షోభం: Economic Depression)




*52. యుద్ధమూ - శాంతీ*

ఈ యుద్ధాలూ మారణహోమాలూ అసలు కనిపెట్టిందెవరో
యుద్ధంలో సాటి మనిషిని చంపినవాడు ఒక దేశానికి హీరో
మరణించినవాడు మరో దేశానికి అంతకన్నా పెద్ద హీరో
కాకపోతే ఇలా కన్నపిల్లల్ని పోగొట్టుకుంటున్న తల్లులు ఎందరో!

*53. తిరునాళ్ళు*

కోటప్పకొండ తిరునాళ్ళలా మేమూ చేసుకుంటాం ఏటేటా
కాకపోతే ఒక సంవత్సరం తానా ఇంకో సంవత్సరం ఆటా
ఆ రెండ్రోజులూ షాపుల్లో సినీతారలతో వేలమంది జనత యువత
మరి తెలుగు సాహిత్య సదస్సుల్లో ఎక్కువమంది వుండరు ఎందుచేత?

*54. అంతరాలు*

నాకూ మా నాన్నారికీ వున్నాయి తరాల అంతరాలు
మాకూ మా అబ్బాయికీ మధ్య తరాల అవాంతరాలు
మాత్రమే కాకుండా ఇంకా వున్నాయి సాంస్కృతిక దొంతరాలు
మరి ఆకులు రాలే ఈ అమెరికాలో ఎంత చెట్టుకి అంత రాలు

*55. భూదేవికి లేదు చారల చీరా జాకెట్టు!*

అగ్రకులం అంటరానితనం, తెలుపూ నలుపూ, నువ్వూ నేనూ, బీదా బిక్కీ
మతాలూ భాషలూ, రాష్ట్రాలూ దేశాలూ కొట్టుకు చస్తాం మనం నీలిగీ నిక్కీ
అంతరిక్షంలోనించీ చూస్తూ వ్యోమగామి కల్పనా చావ్లా ఏమందో తెలుసా నీకు
అక్కడ్నించీ చూస్తే మన అందమైన భోగోళం మీద ఏ గీతలూ కనపడటం లేదని!

*56. ఉత్తముడు*

గజగజా వణుకుతూ అన్నాడు ఈ చలి పోయి ఎండ వస్తే బాగుంటుందని
ఎండలు మండిపోతుంటే విసుక్కున్నాడు ఏమిటిలా అసలు వానలే లేవని
జోరున వాన పడుతుంటే తడుస్తూ అంటాడు ఎందుకొచ్చిందీ తద్దినం అని
లేనిదాన్ని కోరక మనసుకి పగ్గాలు వేసి ఉన్నది అనుభవించటమే ఉత్తముడి పని

*57. వేదం*

గుడి మెట్ల మీద కూర్చుని నీరసంగా చేస్తున్నది ఆ పిల్ల ఆర్తనాదం
భక్తులిచ్చే చిల్లరా ప్రసాదం కోసం ఆమె ప్రేగులు చేస్తున్నాయి వీరాంగం
సోలి వాలి పాలిపోయిన ఆ పసిదాన్ని పట్టించుకోటంలేదు భక్త జనాంగం
మనిషి సాటి మనిషిని మనిషిగా చూసినప్పుడే అది ఆది ప్రణవనాదం!

*58. పేరులోనే వుంది*

అమెరికాకి రాగానే మన సరస్వతి శారా అయిపోయింది
జోగినాధాన్ని ఆఫీసులో అందరూ ముద్దుగా జో అంటారు
మీ ఇండియన్ పేర్లు చాల పొడుగు పలకటం కష్టం అంటాడు మైక్
అతని పేరు మాత్రం మైకేల్ డగ్లస్ మెలినాస్కీ అని మెలికలు తిరుగుతుంది

*59. మునకే సుఖమనుకోవోయ్!*

తెలుగు సినిమాలో హీరో అవాలంటే నటశూన్యుడివైనా ఫరవాలేదు
ఏ సినీ నక్షత్రానికో నిర్మాతకో దర్శకుడికో కొడుకుగా పుట్టు చాలు
మీ నాన్న అభిమానులు నీ కుప్పిగంతులు భరించి నిన్నో సూపర్ హీరోని చేస్తారు
అది కుదరకపోతే నీకు పోయేదేం లేదు నీ పెద్ద దిక్కు మునిగిపోతాడంతే!

*60. కావలెను*

కొత్త తెలుగు సినిమాలో వేయుటకు అందమైన హీరోయిన్ కావలెను
నటనా, తెలుగూ, బట్టలూ హుసేన్‌సాగర్‌లో చింపి పార వేయవలెను
బోసి బొడ్డు ఒళ్ళు కాళ్ళు పెదవుల ఆరబోతలే బాహుమూల విరాట్టులు
అర్ధనగ్నంగా కుప్పిగంతుల కసరత్తులే నేటి సినిమాల్లో వేడివేడి పెసరట్టులు

*61. అమెరికా మాటలకి అర్థాలు వేరులే!*

రెస్ట్ రూం అంటే విశ్రాంతి మందిరం కాదు టాయిలెట్టు
పేవ్‌మెంట్ అంటే సైడ్ వాక్ కాదండీ బాబు తారు రోడ్డు
జాన్ అంటే జనవరీ కాదు, గాస్ అంటే గ్యాసూ కాదు
హోటలంటే తినే చోటు కాదు, మరేమిటిది తిరుమలేశా?

*62. ఎన్ని కలలు*

విద్యార్థితో విద్యార్థులకు భవిష్యత్తుపై ఎన్నో ఊహల కలలు
నిరుద్యోగులకు జీవితంలో నిలద్రొక్కుకోవాలనే ఆశల కలలు
ఉద్యోగులకు జీవితాన్ని సఫలం చేసుకోవాలనే తీయటి కలలు
ఈ కలలన్నీ ఎన్నికలు తీరుస్తాయనుకోవటం పగటి కలలు!

*63. వినాయకులు*

పార్టీలు కాదు ప్రజలు కావాలనేది ఆనాటి భారతీయుల నినాదం
ఏ పార్టీ పదవిలోకి వస్తే అదే నా పార్టీ అనేది ఈనాటి అవసర వాదం
ప్రజలూ కాదు పార్టీలూ కాదు కావలసింది కేవలం ప్రజల ఓట్లు
నోట్లు చల్లి ఓట్లు పండిస్తే వాటికి కాస్తాయి మరెన్నో రెట్ల కోట్లు!

*64. జోకరు*

బీజేపీలో బకురుద్దీన్ సాహెబ్ గారు
టీడీపీలో ఒక రెడ్డి శాస్త్రి మాష్టారు
కాంగ్రెస్ మనుగడకి గాంధీగారి పేరు
ఆట గెలవాలంటే కావాలి ఒక జోకరు!

*65. ఆద్యంతాల మధ్య*

పుట్టినప్పుడు అమ్మని కష్టపెట్టి నువ్వు ఏడుస్తూ పుట్టావు
చనిపోయినప్పుడు నీ వాళ్ళనందర్నీ ఏడిపించి వెళ్ళిపోతావు
ఆ పుట్టుక చావుల మధ్య కూడా నీకా ఏడుపెందుకు నాయనా
నువ్వు నవ్వుతూ సాటి మనిషిని నవ్విస్తూ హాయిగా జీవించరాదూ!




*66. బొరుసు - బొమ్మ*

మనకి వున్న బంధాలూ అనుబంధాలూ అమెరికన్స్‌కి లేవు సుమ్మా
వాళ్ళకి మదర్స్ డే నాడే గుర్తుకి వస్తుంది ఓల్డేజ్ హోంలోని అమ్మ
అంటాడు పదేళ్ళ క్రితం ఇండియాలో అమ్మనొక్కత్తినే వదిలేసి వచ్చిన వాజమ్మ
మన చేతిలోని నాణానికి అవసరవాదాన్ని బట్టి వుంటాయి బొరుసూ బొమ్మ!

*67. నీలోకి నువ్వు*

ఎందుకీ కులమత కుమ్మక్కుల రాజకీయ బులపాటం
ఎక్కడిదీ మనిషిని మనిషే పీక్కుతినే అనర్థ ఆరాటం
బయటికి చూస్తే కనపడేవి నీ అత్యాశల రంగుల కలలు
నీలోకి నువ్వు తొంగి చూడు, కనిపిస్తాయి జీవన సత్యాలు!

*68. తెగులు*

షాంతా ష్యామూ షంకర్ అంటాడు ఆదరాబాదరా తెగులు మిత్రుడు
మొగుడ్స్ పెళ్ళామ్స్ అదుర్స్ దేశముదురని ఇరగదీస్తాడు సినిమా వాడు
ఆటో అంకుల్ కుకింగ్ ఆంటీ అంటాడు ఇంగ్లీష్ మీడియం కుర్రాడు
టీవీ 'యాంకరు' విష్ యు హాపీ బాత్ డే అండీ అని తెలుగులో బాదుడు!




*69. యాషెస్*

లింగూ లిటుకూ మంటూ ఐదు రోజులు టిక్కూ టిక్కూ ఆడే క్రికెట్ టెస్ట్
అటు ఆడే వాళ్ళకీ ఇటు చూసే వాళ్ళకీ అది అర్ధంలేని పరమ టైమ్ వేస్ట్
ఈ సూపర్‌ఫాస్ట్ రోజుల్లో ఇంకా ఎందుకీ మెల్లగా నడిచే ఆ కంచర గాడిద
ఐదు రోజుల శ్రమ తర్వాత డ్రా అయితే చివరికి మిగిలేది చెరి సగం బూడిద!

*70. గంగా ప్రవాహం*

ఆనాడు వినిపించేది తెలుగు నాట మధురమైన పద్యం
ఈనాడు ప్రవహిస్తున్నది తెలుగు నోట మత్తెక్కించే మద్యం
మనకెందుకులే అని అందరూ అలా చూస్తూ వుంటే సోద్యం
మన యువతనీ, జాతి నడతనీ మార్చటం మరెలా సాధ్యం?




*71. ఆకాశంలో నక్షత్రాలు*

కావు కావు నీ చేతిలోని వంకర రేఖలు
పైన ఆకాశంలోని తళుక్కుమనే తారలు
నీ నుదిటి మీద బ్రహ్మ రాయని గీతలు
నీ జీవితానికి నువ్వే తీసుకోవాలి బాధ్యతలు!




*72. పదండి ముందుకు!*

పశ్చిమాన అరేబియా, తూర్పున బంగాళాఖాతం
దక్షిణాన హిందూ మహాసముద్రం, ఉత్తరాన హిమాలయం
ప్రతి దేశానికీ అన్ని వేపులా గొప్పగా వుంటాయి ఎల్లలు
మన దేశప్రగతికి అడ్డొస్తున్న సమస్యలు మాత్రం కొల్లలు!

*73. నిత్యమంగళం*

నిన్న జరిగిపోయినది కొన్ని పేజీల హిస్టరీ
రేపు జరగబోయేది ఎవరికీ తెలియని మిస్టరీ
ఈ రోజు అంటే ప్రెజెంట్ అంటే తెలుగులో బహుమతి
ఆ అందమైన అవకాశాన్ని వదిలేసి పాడకు మంగళహారతి!

*74. హనిమన్ చాలీసా*

కాష్టికం ఖంగూ ఖంగూ దగ్గు మీద చేస్తుంది థాష్టికం
పల్సటిల్లా చురుగ్గా పనిచేస్తుంది తలనొప్పి వచ్చినప్పుడల్లా
బ్రయోనియా జలుబు కోసం ఎప్పుడూ ఇంట్లో వుండాలయా
హోమియోపతి మందుల్నే సర్వరోగాలకూ వాడతాడు సీతాపతి

*75. తెలుగువాడి తిండి*

ప్రొద్దున్నే కాఫీతో పాటూ ఇడ్లీ సాంబార్ దోసె ఉప్మా పెసరట్టు
మధ్యాన్నం రాత్రీ పప్పూ కూరా పులుసూ పెరుగుల పెద్ద పట్టు
సాయంత్రం కారప్పూసా బూందీ బజ్జీ పకోడీల పని పెట్టు
మధ్యే మధ్యే మరి తీపి అరిసెలు లడ్డు కజ్జికాయలు బొబ్బట్టు!

*76. యుగధర్మం*

నట్టడవి నడుమ నష్టకష్టాలు పడింది శ్రీరాములవారి నిండు గర్భిణి సీత
నిండు కొలువులో వస్త్రాపహరణానికి కన్నీరు కార్చింది ద్రౌపది నిస్సహాయత
కన్యాశుల్కం కట్నం శిశు హత్యలూ మన స్త్రీ జాతి నొసటి సింధూరపు రాత
ఈ యుగయుగాల మగజాతి మద మదనాలని మన్నింపవమ్మ భరతమాత!




*77. మా టెల్గూ టల్లికీ...*

తెలుగునాట ఈనాడు అన్నం బదులు వైట్ రైస్ తింటున్నారు
చాల ఇళ్ళల్లో అమ్మానాన్నల బదులు ఇప్పుడు మమ్మీడాడీలున్నారు
మా తెలుగుతల్లికి పాట పాడకూడదన్నాడు టియ్యారెస్ వినాయకుడు
తెలుగు రోడ్డెక్కింది ఎక్కడో కాదు మన టెల్గూ హైదరాబాద్ నడిబొడ్డున!

*78. మూఢనమ్మకమా వర్ధిల్లు!*

చిటిక వేసి గాలిలోనించీ బాబాగారు తీస్తున్నాడు తెల్లటి బూడిద
చిటికేయకుండానే స్వామిజీ సృష్టించాడు పూలూ పళ్ళ సూడిద
ఈ మూఢత్వం వీడిదా వాడిదా మనుష్యుల మనసులోని అలజడిదా
కర్ర తిప్పి మూడుసార్లు కొడితే గుర్రం అవుతుందా కంచర గాడిద!

*79. ఎక్కడినించీ ఎక్కడి దాకా వచ్చాం!*

నాగేశ్వరావూ జగ్గయ్యా ఒక సినిమాలో సావిత్రిని ప్రేమించారనుకోండి
వాళ్ళిద్దర్లో ఒకరు త్యాగం చేసి రెండో వారి కథ సుఖాంతం చేసేవారు
ఇప్పుడయితే ఒక హీరో రెండో కుటుంబం మొత్తాన్నీ కత్తితో నరికేస్తున్నాడు
అది చూసి నిజజీవితంలో యాసిడ్ అమ్మాయిల ముఖాన చల్లుతున్నారు!

*80. ఆస్కార్లూ - పురస్కార్లూ*

ఈనాటి మన తెలుగు చలనచిత్ర కలాకండాలకి అసలేమీ రావటం లేదు ఆస్కార్లు
అయినా వాళ్ళ హీరోల అభిమానులా సినిమాలను చూస్తూనే వున్నారు ఎన్నోమార్లు
వెధవ, వెధవన్నర వెధవ, పరమ వెధవ అనే సినిమాలు ఈ ఏటి పోటీ సినిమా పేర్లు
ఎంతో ప్రాత్రోచితంగా నటించిన ఆ హీరోల్లో ఎవరికో ఈసారి టాలీవుడ్ పురస్కార్లు!




*81. నాభి సుందరి నటన*

పాటలు రావు కనుక చిత్ర నేపథ్య సంగీతం
తెలుగు రాదు కనుక సునీత మాటల సారథ్యం
ముఖకవళికలుండవు కనుక పెదవుల సౌందర్యం
లేదా బొడ్డు మీద పూలతో దృశ్య కళా సౌలభ్యం

*82. ధూపం - దీపం*

నీ భావాలు భావనలుగా భావితరం కోసం దాచకు
హీరోలెవరో వచ్చి నీ భవిష్యత్తుకి రంగులు పూయరు
నీ ఆలోచనలకు నువ్వే ఇవ్వాలి వివరణ వితరణ
ఆలోచన దీపం అయితే దాన్ని వెలిగించేది  ఆచరణ

*83. ఇచ్చి పుచ్చుకో*

రా నాతోపాటూ! వెడదాం అలా ఒక్కసారి
చరిత్రని తిరిగిరాద్దాం ఇద్దరం మరోసారి
మనమెంత ప్రేమని అందిస్తే అంతకన్నా ఎక్కువే తిరిగొస్తుంది
అది తెలుసుకోకపోతే మారణహోమం జరుగుతుంది

*84. సరస్వతీ కటాక్షం*

ఎల్‌కేజీ యుకేజీల నించీ కాలేజీ దాకా పరీక్ష పేపర్ల లీకేజీ
చందా కడితే అప్పనంగా వస్తుంది అందచందాల డిగ్రీ పాకేజీ
లేదా కులాల పేరుతో శ్రీప్రభుత్వం చేస్తుంది అర్థంలేని లాలూచీ
ఎటొచ్చీ కష్టపడి చదివేవాళ్ళకే అడ్డొస్తుందీ సరస్వతీ కటాక్ష పిశాచి

*85. బట్టీ విక్రమార్కుడు*

డిగ్రీ కోసం బట్టీ పట్టి చదువు 'కొన'టం వ్యర్థం
నీకు తెలుసా అర్థం చేసుకుని చదవటంలో అర్థం
చదువుకోవటం వల్ల వచ్చేది ఒక్కటే కాదు విజ్ఞానం
వస్తాయి క్రమశిక్షణ వ్యక్తిత్వ వికాసం హేతువాద జ్ఞానం

*86. విధి*

ఆత్మస్థైర్యానికన్నా విధిని నమ్ముతారు కొంతమంది
విధి అంటూ ఇక్కడా అక్కడా ఎక్కడా ఏమీ లేదది
నీ జీవితం స్టీరింగ్ వీల్‌ని నీ చేతుల్లోనే పెట్టుకుని చేస్తే ప్రయాణం
ఏ వీధికి వెళ్ళాలంటే అక్కడికే వెడుతుంది నీ జీవన చక్రభ్రమణం

*87. రావాలని వుంది*

అమెరికా చిన్న దేశాల మీద ఎంతో ధాష్టీకం చేస్తుంది అనీ
శత్రు దేశాల మీద పగబట్టి వాళ్ళని నాశనం చేస్తుంది అనీ
అంటారు కొందరు అమెరికా అంటే మాకు ఇష్టం లేదు అసహ్యం
గో బాక్ యాంకీ, టేక్ మీ విత్ యు అభ్యర్థన మాత్రం అనూహ్యం




*88. అంగట్లో అన్నీ వున్నాయి*

ప్రపంచంలోని కల్లా పెద్దవి తెలతెల్లని మన హిమాలయాలు
మంచు మీద ఆడే ఆటలకి వున్నాయి మనకెన్నో పర్వతచరియలు
చిన్న చిన్న దేశాలెన్నో సీతాకాలపు ఒలెంపిక్స్‌లో మెడల్స్ సంపాదిస్తున్నాయి
మరి వందకోట్ల జనాల భారతం మెడలు దించి తలెందుకు వంచుతున్నదో!

*89. తెలుగు సినిమా కథ*

గిన్నిస్ ప్రపంచ రికార్డుల పుస్తకాల్లోకి ఎన్నో వచ్చాయి కానీ
నాకర్థం కానిదేమిటంటే ఈ విషయాన్ని ఎలా విస్మరించారని
ఒకే కథని తిప్పి తిప్పి తిరగకొట్టి చావగొట్టి చెవులు మూసి
ఆరొందల సినిమాలుగా తీసిన తెలుగు సినిమా తమ్ముళ్ళ ఘనత!

*90. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడు*

భారతంలో అమ్మాయిల కళ్ళల్లోకి చూస్తే సిగ్గులేదా అనేవారు
పెద్దవాళ్ళ ముఖంలోకి సూటిగా చూస్తే మర్యాద నేర్చుకోమనేవారు
అమెరికాలో మాత్రం కళ్ళల్లో కళ్ళు పెట్టి మాట్లాడమంటారు
అలా చేయకపోతే వాళ్ళ దగ్గర మనమేదో దాస్తున్నామనుకుంటారు

*91. పడమటి సంధ్యారాగం*

భుజాలెగరేసి చేతులతో మాట్లాడతాడు బాబీ
చూపులు కలిపి స్నేహపూర్వకంగా చూస్తుంది కేటీ
ఏనాడూ పెదాల మీద చిరునవ్వు లేకుండా కనపడదు నోరా
మొదటిసారిగా పడమటి సంస్కృతిని చూస్తే అనిపిస్తుంది ఔరా!

*92. వసుధైక కుటుంబం*

మాకు ఇల్లు అమ్మినాయనకు ఎనిమిదిమంది పిల్లలున్నారుట
అంతమందా అనుకున్న మాకు అక్కడ ఎనిమిది ఫొటోలు కనపడ్డాయి
తెల్ల కుటుంబంలో నల్ల పిల్లలు మెక్సికన్లు ఆసియా సంతతి ముఖాలు
అనాథల్ని చేరదీసి చేయూత నివ్వటమే వారికి తెలిసిన మానవత్వపు విలువలు

*93. ఎంతలో వుండాలో అంతే!*

మొదటసారి కలవగానే మిష్టర్ ఆకెళ్ళ అని పిలుస్తాడు పక్కింటి బ్రిటిష్ వాడు
ఎంతో దగ్గర బంధువులా కృష్ణా అని పిలుస్తాడు ఎదురింటి అమెరికన్ వాడు
ఎవరు ఎలా పిలిచినా స్వంత విషయాలు మాత్రం స్వంతంగానే వుంచుతారు
అడిగితే అవసరానికి ఆదుకుంటారు తప్ప మన జీవితాల్లో తలదూర్చరు

*94. కొండెక్కిన దీపం*

పొగిడే వాళ్ళు ఎప్పుడూ పరాయివాళ్ళు
అవసరం పడిన వాళ్ళు అందలం ఎక్కిస్తారు
శిఖరాగ్రమెక్కినప్పుడే అప్రమత్తంగా వుండాలి
ఏమాత్రం గాలి వీచినా పడిపోతావ్ జాగ్రత్త!

*95. కార్యశూరులు*

విన్నది కొన్నాళ్ళల్లో మరచిపోతాం
చూసింది కొంచెం గుర్తుంటుంది
చేసింది అలా నిలబడిపోతుంది
అందుకే ఆచరణ అవసరం అనేది

*96. అదృష్టం - దురదృష్టం*

అదృష్టం దురదృష్టం అనేవి ఎక్కడా ఏ బజారుల్లోనూ దొరకవు
అవకాశాల్ని అందుకుని సద్వినియోగం చేసుకునేవాడు అదృష్టవంతుడు
వాటిని గుర్తించకుండా అడ్డదోవలు వెతికేవాడు దురదృష్టవంతుడు
విజయానికి కావలసింది చుట్టూ చూడగలిగిన దృష్టి దూరదృష్టి




*97. తెంగ్లీషు*

ఎలాగూ అమెరికా వెడతాను కదా అని తెలుగు నేర్చుకోలేదు
అలా అని ఇంగ్లీషులో సరిగ్గా రెండు వాక్యాలు చెప్పటం రాదు
చివరికి నేర్చుకున్నదేమో అద్దాన్నపు టీవీ, సినిమా తెంగ్లీష్ బాస
రెండిటికీ చెడ్డ రేవడ అంటే ఎవరో చెప్పుకో తిరుమలేశ?

*98. ఉభయ భాషా ప్రవీణులు*

ఈమధ్యనే ఓ సాఫ్ట్‌వేరమ్మాయి హైద్రాబాద్ నించీ దిగుమతయింది
ఇంగ్లీష్ మీడియంలో చదివిందిట తెలుగు అసలేమాత్రం రాదన్నది
ఇంగ్లీష్ మాత్రం గబగబా మంత్రాలు చదివినట్టు మాట్లాడుతుంది
ఈ ఉభయ భాషా ప్రవీణులని ఆ మంత్రాలు వినే దేవుడే రక్షించాలి!

*99. సాహితీ పెత్తందార్లు*

తమ జీవిత కాలంలో కలం పట్టని రాయని భాస్కరులు
సాహిత్య సేవ చేసే వారి మీద ఇంకు చల్లే ముష్కరులు
విమర్శ ముసుగులో సాహిత్య హింస చేస్తున్న దురభిమానాసురులు
మన మధ్యే కనిపిస్తారు ఈ స్వయం ప్రకటిత సాహితీ పెత్తందార్లు!




*100. తెలుగు పుస్తకమా? ఏమది?*

తెలుగు సినిమాలు, టీవీ, క్రికెట్టూ నాతో విరోధం కట్టాయా?
ఉప్పెనలా వచ్చిన ఇంటర్నెట్ నన్ను నట్టేట్లో ముంచేసిందా?
లేదా మన తెలుగు భాషా, చదువూ, సంస్కృతీ అమ్ముడుపోయాయా?
కన్నీళ్ళతో అడిగింది తెలుగువాడిని చరిత్రగా మిగిలిపోతున్న తెలుగు పుస్తకం!



*101. మధ్య తరగతి మందహాసం*

మధ్య తరగతి మనుష్యులకు స్వాభిమానం ఎక్కువ
దు:ఖాన్ని దాచేసి సుఖాన్ని చూపడం పైన మక్కువ
వర్షంలో తడిస్తే మరి తల మీద పడతాయి వాన నీళ్ళు
అలా అయితే సురక్షితంగా దాచుకోవచ్చు కారుతున్న కన్నీళ్ళు

*102. చూపులు కలిసిన శుభవేళ*

పుట్టగానే కెవ్వుకెవ్వుమని ఏడ్చేసిన తర్వాత
అమ్మ ఛాతీ మీద పడుకుని కళ్ళు తెరిచిన వేళ
అలసిపోయిన ఆవిడ ముఖం తృప్తిగా నవ్వినప్పుడు
తల్లికీ బిడ్డకీ మొదటి చూపులోనే ప్రేమ పెళ్ళుబికింది!

*103. సీతారాముల కల్యాణం చూతము రారండీ!*

సీతారాముల్లా కలకాలం కాపురం చేయండి అని పెళ్ళి దీవెనలు
సరే ఈసారికి అలానే కానిద్దాం అన్నారు పైనున్న తథాస్తు దేవతలు
ఆ అనుమానం మొగుడు భరించలేక పోయాడు తను విన్న చెప్పుడు మాటలు
అతను ఇంట్లోనించీ వెళ్ళగొట్టిన భార్య అప్పుడు సీతామహాలక్ష్మిలా నిండు చూలాలు!

*104. లెస్సు లెస్సా?*

టెలిఫోన్ కార్డ్‌లెస్, కంప్యూటర్ వైర్‌లెస్, నైట్‌క్లబ్‌లో డాన్స్ టాప్‌లెస్
బట్టీ చదువు వర్త్‌లెస్, తర్వాత జాబ్‌లెస్, ఉద్యోగం వచ్చినా జీతం వెరీ లెస్
రాజకీయం షేంలెస్, లంచం లాలెస్, చుట్టరికం లవ్‌లెస్, మన వాదనలు బేస్‌లెస్
కొన్ని లెస్సులు లెస్సే కానీ, అన్ని లెస్సులూ లెస్సేననుకోవటం సెన్స్‌లెస్

*105. తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ!*

అభిమాన సంఘాలు తమ హీరోలకు వేస్తున్నాయి రంగురంగుల పతకాలు
పాత నటుల కొడుకులూ మనవలూ ఎగరేస్తున్నారు సరుకులేని సినీ పతాకాలు
అందరి కళ్ళకీ కనిపించేవి సచిన్ తెండూల్కర్ కొట్టే క్రికెట్ శతకాలు
ఇప్పుడెవరికి కావాలి సార్ మీ వేమన, దాశరధి, సుమతీ శతకాలు?



*106. అద్దంలో బొమ్మ*

ఒకడ్ని తిట్టే ముందు నీలోని లోపాలని తట్టి లేపి తడిమి చూసుకో
ఎదుటివాడిని మారమని చెప్పే ముందు నువ్వే మారాలని తెలుసుకో
ఒకడికేసి వేలు చూపిస్తే మూడు వేళ్ళు నిన్ను చూస్తుంటాయి గుర్తుంచుకో
కనీసం రోజుకోసారి మనల్ని మనమే చూసుకోవాలనే అద్దాన్ని కనిపెట్టారనుకో

*107. దేశం పోతున్నది ఎటు*

భూతద్దంతో వెతికినా కమ్యూనిష్టు దేశాల్లో కనపడదు సమ్మెల పోటు
చాల ధనస్వామ్య దేశాల్లో సమ్మెలు చేసినా ఉత్పత్తికి అంటదా ఆటు పోటు
సమ్మెలు, ఘెరావులు, బందులు భారతదేశంలో దేశప్రగతికి సమ్మెట వేటు
బస్సులు షాపులు తగలబెట్టి ప్రజల జీవితాల మీద వేస్తున్నారు విషపు కాటు

*108. దేవుడు పారిపోయాడు*

తను శివార్చన చేయనుగాక చేయనన్నాడు గుడిలోని వైష్ణవ పురోహితుడు
గుడిలోని హుండీనీ నగలనీ నమిలి మింగేస్తున్నాడు రాజకీయ నాయకుడు
గుళ్ళో ధర్మకర్త మైల వచ్చిందని చనిపోయిన తల్లి ఆత్మశాంతికి పూజ చేయకూడదన్నాడు
వచ్చే జన్మలో వీళ్ళ పని పడదాంలే అని అప్పటికా మైలగుడి వదిలి పారిపోయాడు దేవుడు!

*109. పేదరికం*

నువ్వు చదువుకొని ఇంకొకళ్ళని చదివిస్తే మాయమవుతుంది అజ్ఞాన పేదరికం
పుక్కిట పురాణాల బదులు వ్యక్తిత్వ వికాసం అందిస్తే పోతుంది మానసిక పేదరికం
భాషాభిమానం కళాభిమానం దేశాభిమానం వుంటే పారిపోతుంది సాంస్కృతిక పేదరికం
సాటి మనిషిలోని మనిషిని మనిషిగా చూసిన రోజున సమసిపోతుంది సర్వత్రా పేదరికం!

*110. ఆద్యంతాల మధ్య మనిషి*

గుడ్డు క్రింద పడి పగిలిపోతే ఒక జీవితం అంతటితో అంతమవుతుంది
స్త్రీ కడుపులో బీజం పడితే కొత్త జీవితానికి అంకురార్పణ జరుగుతుంది
మానవత్వాన్ని జార విడుచుకుంటే మనిషి మనుగడ ముక్కలయిపోతుంది
మంచి కోసం ఏ మార్పు వచ్చినా అది మనిషి లోపలినించీ రావలసిందే!




*111. జయం మనదే!*

విజయ సాధనకి ముచ్చటగా మూడే మూడు మార్గాలు
కళ్ళు తెరుచుకుని చుట్టూతా జరుగుతున్నది చూడటం
చెవులు రిక్కించుకుని నిర్ణయాలకి కావలసిన సమాచారం సేకరించటం
నోరు మూసుకుని తక్కువగా మాట్లాడి ఎక్కువగా ఆచరణలో పెట్టటం!

*112. ఎలా వున్నారో ఏమిటో!*

ఇక ఈ అమెరికా వంటింటి పద్యాలు పూర్తయిపోతున్నాయి కనుక
మనమివి ఎక్కడ మొదలు పెట్టి ఎక్కడిదాకా వెళ్ళామో చూసుకున్నాక
చూద్దాం మన సుబ్బారావూ అప్పారావూ నరసమ్మల ఎన్నారై కథల వెనుక
వారి తీపి కలల చేదు నిజాలు, వాటితోపాటు వచ్చిన విజయాల కానుక!

*113. అప్పారావు*

అమెరికా వెళ్ళి ఏ తెల్లపిల్లనో పెళ్ళి చేసుకుంటాడని భయపడిన అమ్మ
అతను తనని హైదరాబాద్‌లో ముసలిగృహంలో చేర్పిస్తుంటే భయపడింది
అమెరికాలో అతను పిల్లలున్న నలపిల్లను పెళ్ళిచేసుకుంటుంటే తెల్లబోయింది
చివరికతను అమెరికాలోనే స్థిరపడిపోతే కొడుకు సుఖంగావుంటే అదే చాలని నిట్టూర్చింది

*114. సుబ్బారావు*

సుబ్బారావుని వదిలిపెట్టలేని పిచ్చి మాలోకం అమ్మ రోజూ కళ్ళ నీళ్ళు పెట్టుకునేది
అతని చదువు కోసం చేసిన అప్పు ఇంకా తీరుస్తూనే వున్నాడు అమెరికా అబ్బాయి నాన్న
వెనక్కి తిరిగి వచ్చేస్తాడని ఎదురు చూసీ చూసీ శాశ్వతంగా కళ్ళు మూసుకుంది తల్లి
ఉన్న ఒక్క గదిలో తన వంట తనే వండుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు ముసలి తండ్రి

*115. నరసమ్మ*

నరసమ్మగారి నాన్న కాన్సర్‌తో బాధపడి చనిపోయాడని
అమెరికాలేజీలో చేరి నలభయ్యో ఏట ఆనకాలజీ డాక్టరయింది
అమెరికాలోనే కాక ఇండియాలోనూ కాన్సర్ రోగులను ఆదుకుంటున్నది
సంపాదించిన డబ్బుతో భారతంలోని గ్రామాల్లో సామాజిక సేవ చేస్తున్నది



*116. అంకితం*

ఆరుద్రగారూ మీ ముద్రతో షడుచులతో సాధ్యమైనంత రుచిగా వండి
వడ్డిస్తున్నాను కాళ్ళు చేతులూ కడుక్కుని వచ్చి ఇలా ఆసీనులు కండి
సాహిత్య సుగంధంలో ముంచి మమ్మల్నరించిన మీ చేతులు చాపండి
ఉడతాభక్తితో అందిస్తున్నాను ఈ అమెరికా వంటింటి పద్యాలందుకోండి!

సమాప్తం